నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 22 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

సమ్మక్క-సారలమ్మకు మొక్కులు

ఎత్తు బంగారం ఇస్తున్న భక్తులు

బెల్లంపల్లి, జనవరి 21 : పట్టణంలో ఆదివారం వన దేవతలైన సమ్మక్క-సారల మ్మకు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. వచ్చే నెలలో మేడారంలో జరిగే మహాజాతరను పురస్కరిం చుకుని స్థానికంగా నిలు వెత్తు బంగారంతో పూజలు చేశారు. అనంతరం స్థానికు లకు పంపిణీ చేశారు. బజా ర్‌ఏరియా, పాత బస్టాండ్ ఏరియాల్లోని కిరాణాషా పులు భక్తులతో సందడిగా కనిపించాయి.

25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై..

1997-98 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు

దండేపల్లి, జనవరి 21 : మండలంలోని రెబ్బెన్‌పెల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1997-98లో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమ వారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసు కొని జ్ఞాపకాలు నెమరేసుకు న్నారు. నాటి ఉపాధ్యాయు లను సన్మానించారు. ఒకరినొ కరు ఆప్యాయంగా పలకరించు కున్నారు. ఎవరు ఏయే రంగాల్లో స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. ఊరికోసం, పాఠశాల అభివృద్ధి కోసం సహకరిస్తామని తెలిపారు. గురువులు చూపించిన మార్గంలో నడవడం వల్లే జీవితంలో స్థిరపడ్డామన్నారు. ఈ సందర్భంగా బాల్యమిత్రురాలు పుష్పలత కుటుంబానికి రూ.5 వేల సాయమందించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సమ్మేళనం

ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మంచిర్యాల అర్బన్, జనవరి 21 : మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల ద్వితీయ సమ్మేళనాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాలులో అంగరంగ వైభవంగా నిర్వహించారు. 1975 నుంచి 1995 వరకు విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై స్నేహితులతో ఆనందంగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. పూర్వ విద్యార్థి, మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, సురేఖ దంపతులు హాజరు కాగా, వాని ఘనంగా సన్మానించారు. గ్రూపు ఫొటోలు దిగుతూ ఆనందంగా గడిపారు.

'ఫొటో ఓటరు జాబితా సవరణ'ను పకడ్బందీగా నిర్వహించాలి

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు భారతి లక్పతినాయక్
- మంచిర్యాలలో నాలుగు జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో సమావేశం

మాట్లాడుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు భారతి లక్పతినాయక్

నస్పూర్/ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 21 : ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024ను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు బీ. భారతి లక్పతినాయక్ ఆదేశించారు. ఆది వారం నస్పూర్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆసిఫాబాద్, మంచి ర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు బోర్కడే హేమంత్ సహదేవ్ రావు, బదావత్ సంతోష్, రాహుల్‌రాజ్, అశీష్‌సంగ్వాన్, అదనపు కలెక్టర్‌లు దీపక్ తివారీ, దాసరి వేణు, రాహుల్, సభావత్ మోతీలాల్, ఫైజన్ అహ్మద్ లతో కలిసి ఎన్నికల, రిటర్నింగ్ అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, సూపర్ వైజర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి లక్ పతినాయక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, దానిని సద్వినియోగం చేసుకోవాలంటే ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా 6,7,8 ఫారాల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరి శీలించాలని కోరారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, వయసు, అర్హత గల దివ్యాం గులు, ట్రాన్స్‌జెండర్లు తమ వివరాలు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో ఓటర్ల ఫొటోలు స్పష్టంగా కనబడే విధంగా చూడాలని సూచించారు. ఫిబ్రవరి 2న ఫిర్యాదులను పరిష్కరించా లని, 6న పారామీటర్లు పరిశీలించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం అనుమతి పొంది.. 8న తుది జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. నూతన ఓటరు నమోదు, జాబితా సవరణపై జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. మంచిర్యాల కలెక్టర్ బదా వత్ సంతోష్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబి తాలో వివరాలు నమోదు చేసుకునేలా అవగాహన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన..

సీసీసీ నస్పూర్, జనవరి 21: పొరపాట్లు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ ఓటరు జాబితా పరిశీలకులు బీ భారతి లక్పతి నాయక్ ఆదేశించారు. ఆదివారం నస్పూర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 335, 336, 337, 338 పోలింగ్ కేంద్రాలను ఆమె కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి సందర్శించారు. ఓటరు నమోదు పక్రియ, తొలగింపులు, మార్పులు చేర్పుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటరు లిస్టులను పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. స్పష్టమైన ఫొటో ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా నూతన ఓటరు నమోదు, సవరణలు, మార్పులు, తొలగింపుల కోసం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరణించిన వారి వివరాలను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు నోటీలు జారీ చేయాలని సూచించారు. 22వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించి, ఫిబ్రవరి 2వ తేదీలోగా పరిష్కరించాలని, 8వ తేదీ వరకు తుది ఓటరు జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట మంచిర్యాల ఆర్డీవో రాములు, తహసీల్దార్ వనజారెడ్డి ఉన్నారు.

సీసీసీ ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో పోలింగ్ బూత్ వద్ద ఓటరు లిస్టును పరిశీలిస్తున్న భారతి లక్పతి నాయక్

పూసాయికి పోటెత్తిన భక్తజనం

జైనథ్, జనవరి 21 : పూసాయి గ్రామంలోని రేణుక ఎల్లమ్మ తల్లి జాతర పుష్యమాసంలో ప్రారంభం కాగా.. మాఘమాసం వరకు కొనసాగనున్నది. ఇందులో భాగంగా ఆదివారం ఎల్లమ్మ జాతర భక్తులతో కిటకిటలాడింది. తెలంగాణ రాష్ట్రంలోని ఆయా జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు తర లివచ్చి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పాడి పంటలతోపాటు సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించారు. కోనేరులో స్నానం చేస్తే చర్మవ్యాధులు నయం అవుతాయని, ఈ నీళ్లను చేలలో చల్లితే చీడపీడలు తొలిగి పోతాయని భక్తుల విశ్వాసం. సర్పంచ్ పోతారెడ్డి ప్రత్యేక ఏర్పాట్లను చేయగా.. ఎస్ఐ పురుషోత్తం ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

మైనార్టీ గురుకులం పిలుస్తోంది

ఐదో తరగతిలో 200 సీట్లు, ఇంటర్‌లో 240 సీట్ల భర్తీకి నోటిఫికేషన్

మంచిర్యాలలోని మైనార్టీ పాఠశాల

- 6,7,8వ తరగతుల్లోనూ చేరేందుకు అవకాశం
- ఫిబ్రవరి 6వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- మెరిట్ ఆధారంగా ఎంపిక

మంచిర్యాల అర్బన్, జనవరి 21 : జిల్లా లోని మంచిర్యాల(బాలికలు), బెల్లంపల్లి(బా లికలు), చెన్నూర్ (బాలుర) మైనార్టీ గురుకు లాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో చేరేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా దరఖా స్తులు స్వీకరిస్తున్నది. ఐదో తరగతిలో 200 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 240 సీట్లు భర్తీ చేయనున్నది.

ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో స్వీకరణ..

జిల్లాలోని మూడు మైనార్టీ గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్స రంలో ప్రవేశాలకు ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌ఆన్‌లైన్(www.tmreistelangana.cgg.gov.in)లో దరఖాస్తుల స్వీకర ణకు మైనార్టీ సంక్షేమశాఖ అవకాశం కల్పిం చింది. వీటితో పాటు ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో ఖాళీలను భర్తీ చేయనున్నది. మంచిర్యాల, చెన్నూర్ పాఠశాలల్లో ఐదో తర గతిలో 80 సీట్లు, బెల్లంపల్లి పాఠశాలలో 40 సీట్ల చొప్పున 200 సీట్లు, మంచిర్యాల, బెల్లంపల్లి కళాశాలల్లో ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్ల చొప్పున మొత్తం 160 సీట్లు, చెన్నూర్ కళాశాలలో సీఈసీ 40 సీట్లు, హెచ్‌ఈసీ 40 సీట్ల చొప్పున రెండు గ్రూపులకు 80 సీట్లను భర్తీ చేయనున్నది. అలాగే 6, 7, 8వ తరగ తుల్లో ఖాళీగా ఉన్న సీట్లను కూడా పరీక్ష నిర్వ హించి మెరిట్ ఆధారంగా నింపనున్నారు.

మెరిట్ ఆధారంగా ఎంపిక...

నూతన అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్ష నిర్వ హించి మెరిట్ ఆధారంగా అవకాశం కల్పి స్తారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతమైతే రూ. 1.50 లక్షలు, పట్టణమైతే రూ. 2 లక్షలు ఉండాలి. అలాగే 75 శాతం మైనార్టీలు, 12 శాతం బీసీలు, ఆరుశాతం ఎస్సీలు, నాలుగు శాతం ఎస్టీలకు, రెండు శాతం ఓబీసీలకు సీట్ల కేటా యింపులో రిజర్వేషన్ అమలు చేస్తారు. ఈ లెక్కన 80 సీట్లకుగాను 51 ముస్లిం మైనార్టీ లకు, బీసీ(సీ)కి ఐదు సీట్లు, నాలుగు సీట్లు సిక్కు, జైనులు, పార్శీలు, బుద్ధులకు, మరో 20 సీట్లు నాన్ మైనార్టీలకు కేటాయిస్తారు.

మెరుగైన వసతులు, విద్య..

మైనార్టీ గురుకులాల్లో సకల సౌకర్యాలు కల్పించడంతో పాటు మెరుగైన విద్యనందిస్తు న్నారు. విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు, క్రీడా దుస్తులు, కాస్మో టిక్స్ ఉచితంగా అందిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, సాయంత్రం స్నాక్స్ ఇస్తారు. వారంలో ఐదు రోజులు కోడిగుడ్లు, నెలలో ఆరుసార్లు మాంసంతో భోజనం అందిస్తారు. సీసీ కెమెరాల నిఘాతో పాటు విద్యార్థులకు అందుబాటులో వైద్య సిబ్బంది ఉంటారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థులు వెబ్‌సైట్, టిమ్రీస్ యాప్ ద్వారా ఫిబ్రవరి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. అడ్మిషన్లకు సంబంధించిన వివరాల కోసం మీ సేవ కేంద్రాలు, మైనార్టీ గురుకులాలు, కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చు. ఆసక్తి గల మైనార్టీ (ముస్లిం, క్రిస్టియన్, బౌద్ధులు, సిక్కులు, జైనులు, పార్శీలు), నాన్ మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- దమయంతి, ప్రిన్సిపాల్, మైనార్టీ పాఠశాల/కళాశాల, మంచిర్యాల

సంప్రదించాల్సిన నంబర్లు..

మైనార్టీ గురుకులం	ప్రిన్సిపాల్	మొబైల్ నంబర్
మంచిర్యాల (బాలికల పాఠశాల, కాలేజ్)	దమయంతి	9441953065
బెల్లంపల్లి (బాలికల పాఠశాల, కాలేజ్)	షబానా అన్సారీ	9502724286
చెన్నూర్ (బాలుర పాఠశాల)	దేవేందర్	9494580209
చెన్నూర్ (బాలుర కళాశాల)	తిరుపతి	9866246206

గంగాజల సేకరణకు పయనం

హస్తలమడుగుకు పాదయాత్రగా బయలుదేరిన మెస్రం వంశీయులు

- ఝరికి సంప్రదాయ పూజలు.. ఈనెల 28న పవిత్ర జలం సేకరణ
- ఫిబ్రవరి 9న అర్ధరాత్రి నాగోబాకు మహాపూజ

గంగాజల సేకరణ కోసం పాదయాత్రగా వెళ్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, జనవరి 21 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో గల నాగోబా మహాపూజకు ఉపయోగించే గంగాజల సేకరణ కోసం హస్తలమడుగుకు మెస్రం వంశీయులు ఆదివారం బయలుదే రారు. ముందుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తోపాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివ చ్చిన మెస్రం వంశీయులు మధ్యా హ్నం పురాతన నాగోబా ఆలయం(మురాడి)కి చేరుకున్నారు. ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని మార్గాలపై చర్చించారు. అనంతరం మురాడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడే భద్రపర్చిన గంగాజల ఝరిని కటోడ కోసేరావ్, నాయికివాడి ధర్మ, కటోడ హను మంత్‌రావ్ బయటకు తీశారు. ఆలయం పక్కన తెల్లవస్త్రంపై ఝరిని పెట్టి సంప్ర దాయం ప్రకారం పురుషులు, మహిళలు వేర్వేరుగా పూజలు చేశారు. గంగాజలం తీసు కొచ్చే ఝరిని కటోడ కోసు వీపుపై తెల్లవ స్త్రంతో కట్టారు. గంగాజలం సేకరణ కోసం కాలినడ కన వెళ్తున్న కటోడ కో సుతోపాటు 150 మంది మెస్రం వంశీయులు గిరిజన సంప్రదాయం ప్రకా రం మర్యాద పూర్వకంగా ఒకరినొకరు కలుసుకు న్నారు. గ్రామం నుంచి పొలిమేర వరకు గ్రామస్తుల తోపాటు మె స్రం వంశీయులు వారిని సంప్రదా యం ప్రకారం సాగనంపారు. ఈ కా ర్యక్రమంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ పటేల్, మె స్రం వంశీయులు చిన్ను పటేల్, బాజీ రావ్ పటేల్, లింబారావ్, కటోడ కోసేరావ్, కటోడ హనుమంత్ రావ్, ప ర్ధాంజీ దాదారావ్, నాయికి వాడి మెస్రం ధర్మ, పేన్ కోత్వాల్ మెస్రం తిరుపతి, గణపతి, మెస్రం మనోహర్, నా గోరావ్, జంగు పటేల్, సోనేరావ్, దేవ్‌రావ్, నాగ్‌నాథ్, తుకారాం, శేఖర్‌బా బు, జంగుబాపు, ఆనంద్‌రావ్, సీతా రాం, కార్తీక్, మారుతి పాల్గొన్నారు.

పాదయాత్ర విశేషాలు..

- జనవరి 21న కేస్లాపూర్ నుంచి ఆదివారం సాయంత్రం ప్రారంభమైన గంగాజల సేకరణ పాదయాత్ర రాత్రికి కేస్లాగూడ(జీ) గ్రామానికి చేరుకొని బస చేశారు.
- 22న నార్నూర్ మండలంలోని గుంజాల గ్రామానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.
- 23న నార్నూర్ మండలంలోని నాగల్‌కొండ
- 24న జైనూర్ మండలంలోని గౌరి
- 25న లింగాపూర్ మండలంలోని గుమ్నూర్
- 26న జన్నారం మండలంలోని ఇస్లాంపూర్
- 27న దస్తురాబాద్ మండలంలోని మల్లాపూర్
- 28న జన్నారం మండలంలోని గోదావరి నదికి ప్రత్యేక పూజలు చేసి, హస్తలమడుగులో గంగాజలం సేకరిస్తారు. అదేరోజు తిరుగు పయనమై ఉట్నూర్‌కు చేరుకుంటారు.
- 29న ఉట్నూర్ మండల కేంద్రంలో బస చేస్తారు.
- 30న ఇంద్రవెల్లి మండలంలోని దోడంద గ్రామానికి చేరుకుంటారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 1, 2, 3, 4 వరకు అక్కడే బస చేస్తారు.
- ఫిబ్రవరి 5న ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం కేస్లాపూర్ మర్రిచెట్ల వద్దకు చేరుకుంటారు. మూడు, నాలుగు రోజులు మర్రిచెట్ల నీడలోనే బస చేస్తారు.
- ఫిబ్రవరి 6న రాత్రి మెస్రం వంశీయుల పటేళ్లు మర్రిచెట్ల వద్దకు చేరుకోగానే వారికి ఘనంగా స్వాగతం పలుకుతారు.
- ఫిబ్రవరి 7న కర్మకాండా(తూమ్) పూజలు నిర్వహిస్తారు.
- ఫిబ్రవరి 8న ధర్మాన్ చేస్తూ విశ్రాంతి తీసుకుంటారు.
- ఫిబ్రవరి 9న నాగోబాకు గంగాజలంతో మహాపూజ నిర్వహిస్తారు.

కళ్లెదుటే కబళించిన మృత్యువు

- ఆసిఫాబాద్‌లో కంటైనర్ ఢీకొని భార్య, కుమారుడు మృతి
- తీవ్రగాయాలతో బయటపడ్డ సర్వర్
- బైక్‌పై బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా ప్రమాదం
- భట్టుపల్లిలో విషాదం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫ్ (ఫైల్)

జహీరా (ఫైల్)

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 21 : బైక్‌పై బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా.. కంటైనర్ ఢీకొట్ట డంతో తల్లీ కొడు కులు మృతి చెందిన ఘటన ఆదివారం జిల్లా కేంద్రంలోని అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో కుటుంబ పెద్ద తీవ్రగాయాలతో బయటపడగా, తన కళ్లెదుటే భార్య, కుమారుడు మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ సర్వర్ తన భార్య జహీరా (35), కుమారుడు ఆసిఫ్(16)తో కలసి బైక్‌పై ఆదివారం ఉదయం 7 గంటలకు ఆసిఫాబాద్‌లోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఉదయం 11 గంటల ప్రాంతంలో తిరిగి వెళ్తున్న క్రమంలో ఆసిఫాబాద్‌లోని అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద ప్రధాన రహదారి దాటుతుండగా, మంచిర్యాల వైపు నుంచి చంద్రాపూర్‌కు వెళ్తున్న కంటైనర్ ద్విచక్ర వాహనంపైకి దూసుకెళ్లింది. దీంతో జహీరా, ఆసిఫ్ అక్కడికక్కడే మృతి చెందగా, సర్వర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అదే కంటైనర్ మంచిర్యాల వైపు వెళ్తున్న మరో లారీని సైతం ఢీ కొట్టింది. సదరు లారీ డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ దవాఖా నకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కార ణాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

వన్యప్రాణులకు హాని తలపెట్టొద్దు

బాధిత రైతుకు చెక్కు అందిస్తున్న డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, ఎంపీపీ విమలాబాయి

వాంకిడి,జనవరి 21 : వన్యప్రాణులకు హాని తలపెడితే కఠిన చర్యలు తప్పవని డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని సర్కేపల్లిలో పులి దాడిలో మృతి చెందిన పశువులకు సంబంధించిన పరిహారం చెక్కులను ఎంపీపీ విమలాబాయితో కలసి బాధితులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పులి దాడిలో పశు వులు చనిపోతే పరిహారం అందిస్తామన్నారు. అడవి పందుల బెడదతో పంటలు నష్టపోతున్నాయంటూ పలువురు రైతులు, గ్రామస్తులు డీఎఫ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సర్కేపల్లిలోని పిల్లలకు స్కూల్ బ్యాగులు, పెన్నులు, నోటుబుక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అటవీరేంజ్ అధికారి అప్పలకొండ, వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్, డీవైఆర్వో సరోజారాణి, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, అటవీ సెక్షన్, బీట్ అధికారులు, బీఆర్ ఎస్ మండల యువనాయకుడు దీపక్ ముండే, సర్పంచ్ నీల బాయి, మనోహర్ ఉన్నారు.

నేడు ప్రైవేట్ పాఠశాలలకు సెలవు

మంచిర్యాల అర్బన్, జనవరి 21 : అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో ఈ నెల 22న ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు ట్రస్మా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి దేవాలయంలో ప్రత్యేక పూజలు, ర్యాలీలు ఉండనున్న నేపథ్యంలో పిల్లలకు ఇబ్బందులు కలగకుండా సెలవు ప్రకటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.